వసంత
మార్చి 12, [illegible]

భారత కార్మిక ఉద్యమ చరిత్ర
1830 - 1947

కె. బాలగోపాల్

స్టడి సర్కిల్

వరంగల్

50 పైసలు

వరంగల్
స్టడీ సర్కిల్ ప్రచురణ : 1
మే, 1982

సుకోమల్‌సేన్ రాసిన Working Class of India, History & Emergence and movement, 1830–1970 ఆధారంగా.

వెల : 50 పైసలు పేజీలు : 24 ప్రతులు : 2,000

ముద్రణ :
పార్థసారథి ప్రెస్,
విజయవాడ 520 001.

భారత కార్మికోద్యమ చరిత్ర
(1830—1947)

I

పూర్వరంగం

కార్మికులు అంటే పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యే శ్రామికులు. పాశ్చాత్య దేశాలలోలాగ మన దేశంలో పెట్టుబడిదారీ దోపిడీ సహజంగా పుట్టలేదు. అంటే భూస్వామ్య వ్యవస్థను నాశనంచేసి ముందుకు రావడం జరగలేదు. తద్భిన్నంగా, ఇక్కడికి పెట్టుబడిదారీ దోపిడీ ఇంగ్లండునుండి దిగుమతి అయింది.

భారతదేశం బ్రిటన్‌కు వలసగా మారిన క్రమంలో రెండు దశలున్నాయి. మొదటి దశలో, అప్పటికింకా పారిశ్రామిక విప్లవాన్ని సాధించని బ్రిటన్‌కు ఆ విప్లవాన్ని సాధించడానికి అవసరమయిన పెట్టుబడిని సమకూర్చి పెట్టడం భారతదేశపు చారిత్రక కర్తవ్యమయింది. దీనికి సాధనం ఈస్టిండియా కంపెనీ. 1757 నుండి 1812 వరకు భారతదేశపు వాణిజ్యం మీద గుత్తాధిపత్యం వహించిన 'కంపెనీ', ఆ గుత్తాధిపత్యం వల్ల వచ్చిన లాభాలే కాకుండ, రాజుల నుండి, సంస్థానాధీశుల నుండి, వ్యాపార పన్నులు విధించే హక్కును చేజిక్కించుకునీ, వడ్డీ వ్యాపారం చేసీ, సేక

రించిన లాభాలనుగూడ బ్రిటన్‌కు తరలించింది. 'కంపెనీ' లెక్కల ప్రకారమే ఈ రకంగా తరలించిన మొత్తం 10,00,00,000 పౌన్లు.

1812 నాటికి బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలయింది. దానితోబాటే మార్కెట్ల వేటా మొదలయింది. అంతవరకు 'కంపెనీ'కి భారతదేశంతోటి వాణిజ్యం మీద ఉన్న గుత్తాధిపత్యం ఇప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదార్లకు ఆటంకంగా తయారయింది. ఫలితంగా 1812 తో ఆ గుత్తాధిపత్యం పోయి విశృంఖల వాణిజ్యం (free trade) అమలులోకి వచ్చింది. పారిశ్రామిక విప్లవంలో మొట్టమొదట వచ్చిన సాంకేతిక అభివృద్ధి వస్త్ర ఉత్పత్తిలో. త్వరలో బ్రిటన్ ప్రపంచ వస్త్ర ఉత్పత్తిలో 60 శాతం తానే చేయడం మొదలు పెట్టింది. ఉత్పత్తి అయిన వస్త్రాల ఎగుమతికి భారతదేశం మార్కెట్‌గా మారింది. అంతవరకు ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా పట్టు, మస్లిన్ మొదలయిన వస్త్రాలను భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటూన్న బ్రిటన్, 1826 నాటికి 4.2 కోట్ల గజాల నూలు బట్టను భారతదేశానికి ఎగుమతి చేసింది. ఆనాటికే, బ్రిటన్ నుండి జరిగిన మొత్తం ఎగుమతిలో 8 వ వంతు భారత దేశానికి చేరటం మొదలయింది.

ఈ వ్యాపారానికి రైల్వేలు అవసరం. భారత దేశం నలుమూలలా బ్రిటిష్ వస్త్రాలు, ఇతర సరుకులు, అమ్మాలంటే రైల్వే లైన్లు వేయాలి, రైళ్ళు నడిపించాలి. దానికోసం బొగ్గు గనులు తెరవాల్సి వచ్చింది. బెంగాల్ బొగ్గు కంపెనీ 1843 లో స్థాపించబడింది. దాని యాజమాన్యంలో 1895 లో ఝరియాలోని విశాలమయిన బొగ్గు గనులు ఆవిష్కరించబడ్డాయి.

ఎగుమతి అయ్యే వ్యాపార సరుకులకు మారుగా బ్రిటన్ పారిశ్రామిక ముడి సరుకులను దిగుమతి చేసుకోవడం మొదలు పెట్టింది. వీటిలో ముఖ్యమయినవి జనపనార, తేయాకు. మొదటి జనపనార మిల్లు 1854 లో కలకత్తా దగ్గర రిష్రాలో స్థాపించబడింది. మొదటి తేయాకు తోట—అస్సాం తేయాకు కంపెనీ యాజమాన్యంలో—1839 లో నెలకొల్ప బడింది. వీటితోబాటే, బట్టల మిల్లులుగూడ (బ్రిటిష్ పెట్టుబడిదార్ల యాజమాన్యంలోను, దావర్ వంటి కొందరు పార్సీల యాజమాన్యం లోను) స్థాపించబడ్డాయి. 1818 లో కలకత్తా దగ్గర ప్రారంభమయి, 1880 నాటికి మొత్తం 58 బట్టల మిల్లులు వెలిశాయి.

ఈ బొగ్గు గనులలో, తేయాకు తోటలలో, రైల్వేలలో, జనపనార వస్త్ర పరి

శ్రమలలో, పుట్టింది భారత కార్మికవర్గం. అయితే దాని పుట్టుకలోనే కొన్ని అవలక్ష ణాలున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థను నాశనంచేసే క్రమంలో, ఆ భూస్వామ్య సమాజపు వృత్తిపనివారి (artisans) వర్గాన్నిగూడ నాశనం చేస్తుంది. కమ్మరీ, వడ్రంగి, మేదరీ తమ జీవనాన్ని కోల్పోతారు. వాళ్ళ స్థానంలో ఫ్యాక్టరీలు వస్తాయి. అయితే పాశ్చాత్య దేశాలలో తమ జీవనాన్ని కోల్పోయిన వృత్తి పనివాళ్ళు, తమ స్థానాన్ని ఆక్రమించుకున్న ఫ్యాక్టరీలలోనే కార్మికులుగా స్థిరపడ్డారు. అంటే అక్కడి కార్మికవర్గానికి మొదటి నుండి గూడ పారిశ్రామిక ఉత్పత్తిదారుల లక్షణాలున్నాయి. దీనివల్ల వాళ్ళకు కార్మికవర్గ చైతన్యం త్వరలోనే అలవడింది.

వలస సంబంధాల రూపంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించిన మన దేశంలో ఇట్లా జరగలేదు. బ్రిటిష్ ప్రభుత్వం ఒక ప్రక్క బ్రిటిష్ వస్త్రాలను విరి విగా మన దేశానికి ఎగుమతిచేస్తూ, ఇక్కడినుండి సాంప్రదాయకంగా ఎగుమతయిన వస్తువులమీద మాత్రం విపరీతమయిన పన్ను విధించిన కారణాన ఇక్కడి వృత్తిపని వాళ్ళు క్రమంగా తమ జీవనాన్ని కోల్పోయారు. అయితే వాళ్ళ స్థానాన ఫ్యాక్టరీలు ఏర్పడడం చాలా మందకొడిగా సాగిన కారణాన, వాళ్ళంతా గ్రామాలకు వెళ్ళి అక్కడి పీడిత రైతాంగంలో భాగమయ్యారు. గనులలోను, తేయాకు తోటలలోను, జనపనార మిల్లులలోను పనిచేసే కార్మికులు ఈ పీడిత రైతాంగం నుండి వచ్చినవారే గాని వృత్తి పనివాళ్ళ వర్గం నుండి వచ్చినవారు కారు. దీనివల్ల భారతదేశ కార్మిక వర్గపు చైతన్యం చాలా వెనుకబడి వుండడం జరిగిందని, ఆ వర్గానికి పారిశ్రామిక పూర్వరంగం లేకపోవడం వలన, భూమిమీదే ఎక్కువ మమకారం ఉండడం వలన, ఎప్పటికయినా రెండెకరాల భూమి సంపాదించుకుని గ్రామానికి తిరిగిపోదామన్న దృక్పథమే బలంగా ఉండడం వలన,కార్మికోద్యమానికి ఆ వర్గం సంఘటితం కావడం కష్టమయిందని, గుర్తించిన వారిలో ఎం. ఎన్. రాయ్ ఒకడు. ఈ గ్రామీణ పూర్వ రంగం కార్మికోద్యమంలో సంస్కరణ వాదానికి మార్గం సుగమం చేస్తుందని కమ్యూ నిస్ట్ ఇంటర్నేషనల్ తన ఆరవ సమావేశంలో (1928లో) సిద్ధాంతీకరించింది.

ఈ లోపాన్ని పెట్టుబడిదార్లు తమ లాభాలకోసం సహజంగానే వాడుకున్నారు. కార్మికులు సంఘటితం కాలేకపోవడం, దోచుకునేవాడిని 'దొర'గా పరిగణించి వర్గ కసికి బదులు ప్రభుభక్తిని ప్రదర్శించే భూస్వామ్య సమాజతత్వం, వాళ్ళకు చాలా అనుకూల మయినాయి. ఫలితంగా, కార్మికుల జీవన పరిస్థితులు, పని పరిస్థితులు ఎంత అన్యాయంగా తయారయ్యాయంటే, గ్రామీణ ప్రాంతాలలో జమీందారీ దోపిడీ

ఎంత దారిద్ర్యాన్ని సృష్టించినా గ్రామాలను వదలి గనులలోకి తేయాకు తోటలలోకి జనపనార మిల్లులలోకి వెళ్ళడానికి పేద రైతాంగం వెనకాడింది. దానివల్ల, దారిద్ర్యం తాండవమాడే ఈ దేశంలో పారిశ్రామిక కార్మికులకు కొరత ఏర్పడే వికృత పరిస్థితి ఉద్భవించింది. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఈ కొరత కొనసాగింది. బీహార్ నుండి, తూర్పు బెంగాల్ నుండి దారిద్ర్యంవల్ల వలస వెళ్ళినవాళ్ళు పారిశ్రామిక కేంద్రంగా రూపొందుతున్న కలకత్తాలో కార్మికుల కొరత ఉన్నప్పటికీ, కలకత్తా నగరానికంటే పశ్చిమ బెంగాల్ గ్రామీణ ప్రాంతాలకే ఎక్కువగా వెళ్ళారు. 1901 సంవత్సరానికి సంబంధించి ఒక రచయిత వేసిన అంచనా ప్రకారం ముజఫర్‌పూర్ జిల్లా నుండి వలస వెళ్ళిన 67,000 మందిలో కేవలం 20,000 మాత్రమే కలకత్తా నగరానికి వెళ్ళారు.

'ఈ విపరీత పరిస్థితిని గురించి ప్రభుత్వం విచారణ జరపాలి' అని పెట్టుబడిదార్ల సంఘాలు (Chambers of Commerce) ఘోష పెట్టాయిగాని, ఆ పెట్టుబడిదార్ల విపరీతపు దోపిడీయే దీనికి అసలు కారణం. ప్రభుత్వమే నియమించిన ఫ్యాక్టరీ కార్మికుల కమిషన్ రిపోర్టు ప్రకారం, పనికాలం సాధారణంగా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉండేది. ఫ్యాక్టరీకిగాని కరెంటు ఉంటే (ఆ రోజులలో కరెంటు చాలా కొత్త విషయం అని గుర్తుంచుకోవాలి) సూర్యాస్తమయం తర్వాత గూడ పనిచేయాలి. బొంబాయిలోని కరెంటుగల 85 మిల్లులలోకి 60 మిల్లులలో పనికాలం 13 నుండి 15 గంటలు. అహమ్మదాబాద్‌లో 14 గంటలు, బ్రోచ్‌లోను, ఢిల్లీలోను 13½ నుండి 14½ గంటలు, ఆగ్రాలో నయితే 15 గంటల పైబడిగూడ వుండేది. బట్టల మిల్లుల పరిస్థితి ఇట్లాగుంటే, కలకత్తాలోని జనపనార మిల్లులలో పనికాలం 16 గంటలు ఉండేది. అంటే, వైద్యుల సలహా పాటించి ఆనాడు కార్మికులు 8 గంటలు నిద్రతీసే వారనుకుంటే, వారు మెలకువగా ఉన్న కాలమంతా పని చేయాలన్నమాట.

ఇది గూడ కొంత 'భారీ' పరిమాణంగల పరిశ్రమలలోని పరిస్థితి. చిన్నచిన్న ఫ్యాక్టరీలలోని పరిస్థితి—రచయిత భాషలో—నరకప్రాయం. రైస్ మిల్లులలోను పిండి మిల్లులలోను ముద్రణాలయాలలోను 20 నుండి 22 గంటలు పనిచేసే సందర్భాలు గూడ లేకపోలేదని ఏ కమ్యూనిస్టులోకాదు, ప్రభుత్వపు కమిషనే అధికారికంగా చెప్పింది. అంతేకాదు, వాడియా అనే ఒక మిల్లు యజమాని, తన ఫ్యాక్టరీలో ఇంజను

పొద్దున 4 గంటలకు పని ప్రారంభిస్తుందని, రాత్రి తొమ్మిది గంటల వరకు నడుస్తుందని, ఈ సమయమంతాగూడ ఆ కార్మికులే పనిచేస్తారని, అన్నాడు. అమానుషత్వానికి పరాకాష్ఠగా, "పని ఎక్కువగా ఉండే నెలలలో-అంటే మార్చి ఏప్రిల్ నెలలలో-ఫ్యాక్టరీ రాత్రింబగళ్ళు పనిచేస్తుంది. సాయంత్రం ఒక్క అరగంట మాత్రం విరామం ఉంటుంది. కార్మికులు ఇట్లా రాత్రింబగళ్ళు, కేవలం అరగంట విశ్రాంతితో 8 రోజులపాటు పనిచేస్తారు. 8 రోజుల తరువాత ఇక వాళ్ళు పని చేయలేరు కాబట్టి వాళ్ళను తొలగించి, మరొక 8 రోజులపాటు వేరొక కార్మిక బృందాన్ని నియమిస్తాను.... ఇది నా ఒక్కడి అలవాటుకాదు, అందరూ అవలంబించే పద్ధతే.... ఈ విపరీతమయిన పనికాలంవల్ల కార్మికులు చనిపోవడంగూడ అసాధారణం కాదు" అన్నాడు.

1908 నాటి ఫ్యాక్టరీ కార్మిక కమిషన్ రిపోర్టు ప్రకారం, దేశంలోని అన్ని ఫ్యాక్టరీలలోని కార్మికులలో 30 నుండి 40 శాతం వరకు 5 నుండి 7 సంవత్సరాల వయసున్న పసిపిల్లలు.బెంగాలులోని ఒక జనపనార మిల్లునుగురించి చెపుతూ ఆ రిపోర్టు, అక్కడి కార్మికులు మిల్లుకు మూడు నాలుగు మైళ్ళ దూరంలో ఉంటారని, పొద్దున 3 గంటలప్పుడు ఫ్యాక్టరీ సైరన్‌మోత విని 7 సంవత్సరాలలోపున్న పసిపిల్లలు, పాలు తాగే పిల్లలను ఎత్తుకుని స్త్రీలు, చలి అనక, చీకటనక, మూడుమైళ్లు నడిచి ఫ్యాక్టరీలో రోజంతా పనిచేసి మళ్ళీ రాత్రయిన తరువాత అంతదూరమూ నడిచి తిరిగి వస్తారన్నది. మొట్టమొదటి కార్మిక నాయకులలో ఒకడయిన చమన్‌లాల్ అన్నట్టు, బానిసత్వం చూడాలంటే ఏ అబిసీనియాకో లైబీరియాకో పోనక్కరలేదు, ఆనాటి భారతదేశం గర్భంలోనే వుంది.

పని పరిస్థితులు ఇట్లావుంటే, వేతనాలగురించి రచయిత ఒక చక్కటిమాట చెప్పాడు. పరిశ్రమలలో కార్మికులకు ఇచ్చే వేతనాలకు ప్రమాణం పారిశ్రామిక రంగంలోని ఉత్పాదకతకాదు, రైతాంగానికిలభించే దినసరి ఆదాయం. అదే పాశ్చాత్య దేశాలలో నయితే, పారిశ్రామిక వేతనం పారిశ్రామిక ఉత్పాదకతను అనుసరించి వుండి, వ్యావసాయిక వేతనాలకు ప్రమాణాన్ని నెలకొల్పింది. రచయిత మాటల్లో "వేతనాల నిర్ణయంలోని ఈ తలక్రిందులు వ్యవహారం భారతదేశంవంటి వలసదేశాల కార్మికుల జీవనపరిస్థితులలోని వైపరీత్యాలలో ఒకటి."

ఎంతోకొంత ఆధునికమయిన పరిశ్రమలలోని కార్మికుల పరిస్థితి ఇట్లాగుంటే,

తేయాకు తోటలలోని శ్రామికుల పరిస్థితి, కాంట్రాక్టర్ల చేతికి చిక్కి దూరదేశాలకు తరలించబడ్డ శ్రామికుల పరిస్థితి, మరింత దుర్భరం. 18వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి చైనా నుండి ఎగుమతి అయ్యే తేయాకు మీద గుత్తాధిపత్యం ఉండేది. 1833లో ఆ గుత్తాధిపత్యం కోల్పోవడంతో భారతదేశంలో తేయాకు పండించి బ్రిటన్‌కు ఎగుమతి చేయడం మొదలు పెట్టారు. 1869 నాటికి తేయాకు పరిశ్రమ బలంగా నాటుకుంది. తేయాకు తోటలు ఎక్కువగా అస్సాంలో ఉండడం చేత, అస్సాంలో జనసాంద్రత తక్కువ కావడం, భూమిలేని నిరుపేదలు ఎక్కువగా లేక పోవడం చేత, తేయాకు తోటలకు శ్రామికులను దారిద్ర్యానికి నిలయమయిన బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాల నుండి కాంట్రాక్టర్లు తరలించుకు వెళ్ళేవారు. మొత్తం కుటుంబాలకు కుటుంబాలే మూడు సంవత్సరాల కాంట్రాక్టు మీద దూర ప్రాంతాల నుండి అస్సాం తోటలకు వెళ్ళేవారు. నెలజీతం మనిషికి 2 నుండి 5 రూపాయలవరకు ఉండేది. కాంట్రాక్టు పూర్తికాకుండా పారిపోవడం చట్టరీత్యా నేరం కావడం చేత, అట్లా పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ళను అక్కడికక్కడే శిక్షించే హక్కు యజమాన్లకు ఉండడం చేత, కార్మికులు దాదాపుగా బానిసలని చెప్పవచ్చు. తోటల యజమాన్లు (ఎక్కువగా బ్రిటిష్ వాళ్ళు) పెళ్ళికాని కూలీలకంటె పెళ్ళయిన వాళ్ళను నియమించడం లాభదాయకమని భావించడం చేత, కాంట్రాక్టర్లు తమ చేతికి చిక్కిన నిర్భాగ్యులను భార్యా భర్తలుగా జీవించమని బలవంత పెట్టేవారట.

బానిస జీవితాన్ని సహించలేక పారిపోకుండా చూడడం కోసం తోటల చుట్టూ కంచెలు, అన్ని మూలలా చౌకీదార్లు, పారిపోయిన కూలీనిపట్టి ఇచ్చిన వారికి 5 రూపాయలు పారితోషికం - అన్ని ఏర్పాట్లూ చేయబడ్డాయి. పారిపోయే యత్నం చేసి పట్టుబడ్డ వాళ్ళను చెట్టుకు కట్టి కొట్టేవారు.

చట్టం ఎప్పుడూ పాలక వర్గాల అవసరాల్ని సంరక్షించడానికే చేయబడుతుంది. అయితే వలసలలో ఈ స్వభావం మరింత స్పష్టంగా కనబడుతుంది. పాశ్చాత్య దేశాలలో మొట్టమొదటి పారిశ్రామిక చట్టాలు, కార్మికుల ఉద్యమాల ఫలితంగా పుట్టి, కార్మికులకు ఎంతోకొంత రక్షణ నిచ్చాయి. భారతదేశంలో మాత్రం తద్విరుద్ధంగా, మొదటి ఫ్యాక్టరీ చట్టం పరిశ్రమ యజమాన్లయిన బ్రిటిష్ పెట్టుబడిదార్లకు శాశ్వతమయిన శ్రామిక బలగాన్ని సమకూర్చడం కోసం చేయబడింది. (The Assam Plantation Labour Immigration Act, Madras Planters Labour Act) మొదలయినవి తేయాకు తోటల కూలీలకు సంరక్షణ ఈయక పోగా, వాళ్ళ

కాంట్రాక్టు పూర్తి కాకుండా పారిపోతే అది నేరమని,శిక్షార్హమని తీర్మానించాయి. 1860లో జారీ చేసిన Employers and Workers (Disputes) Act యజమానులకు కార్మికులను నిర్బంధించే హక్కు, జుర్మానాలు విధించే హక్కు, ఇచ్చింది.

II

తొలిపోరాటాలు

అమానుషమయిన ఈ దోపిడీకివ్యతిరేకంగా కార్మికులు తిరగబడక ముందే కొందరు సహృదయులయిన వ్యక్తులు తమ తమ పరిమితులలో నిరసన తెలిపారు. సోరాబ్జీ షాపుర్జీ బెంగాలీ అనే అతను చిన్న పిల్లలను పనిలోకి తీసుకునే అలవాటును చట్ట విరుద్ధంగా ప్రకటించమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఒక బిల్లును గూడ తయారుచేసి అందజేసాడు. కాని దానివల్ల ఫలం దక్కలేదు.

వ్యక్తుల కంటే ఎక్కువగా సోంప్రకాశ్, బొంబాయి గెజెట్, ఢాకాప్రకాశ్, అమృత బజార్ పత్రిక వంటి పత్రికలు కార్మికుల దుర్భరమయిన జీవిత పరిస్థితులను ప్రజల దృష్టికి తెచ్చాయి. ముఖ్యంగా అస్సాం తేయాకు తోటలలోని కూలీల పరిస్థితుల గురించి, మన దేశం నుండి మారిషియస్, బ్రిటిష్ గయానా, ట్రినిడాడ్, వంటి ఇతర బ్రిటిష్ వలసలలోని చెరకు తోటలలో పనిచేయడానికి దాదాపుగా బానిసలుగా కాంట్రాక్టర్ల చేత తోలుకు పోబడ్డ కూలీల దయనీయమయిన పరిస్థితి గురించి ఈ పత్రికలు ఆందోళన జరిపాయి.

అయితే ఈ సహృదయుల ఆందోళన సాధించలేని సంస్కరణలను బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు భారత దేశంలోని పెట్టుబడిదార్లకు (వీళ్ళలో భారతీయులూ ఉన్నారు, ఇంగ్లీష్ వాళ్ళూ ఉన్నారు) ఉన్న వైరుధ్యం సాధించింది. విపరీతమయిన దోపిడీ చేసే అవకాశం గల భారత దేశపు పెట్టుబడిదార్లతో పోటీ పడడం కష్టమయి పోయిన బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు హఠాత్తుగా మానవత్వం జ్ఞాపకం వచ్చి, ఈ 'అమానుషమయిన పద్ధతులను' నిలపవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరగా, బ్రిటిష్ ప్రభుత్వం 1881లో మొదటి ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టి, తద్వారా 7 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలను పనిలోనికి తీసుకోగూడదని, 7 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సుగల వాళ్ళచేత రోజుకు 9 గంటల కంటె ఎక్కువ పని చేయించ గూడదని, ఇత్యాది నిర్బంధాలు పెట్టింది. అయితే ఈ చట్టం 100 మంది

కంటే ఎక్కువ కార్మికులుగల ఫ్యాక్టరీలకు మాత్రమే వర్తించడం చేత దాదాపుగా నిష్ఫలమయింది. 1908 సంవత్సరంలో నియమించబడ్డ ఫ్యాక్టరీ కార్మిక కమీషన్‌కు చిన్న పిల్లల నియామకం దేశ వ్యాప్తంగా కనిపించింది.

తేయాకు తోటల కూలీలకు ఈ మాత్రం గూడ దక్కలేదు. కలకత్తా నుండి ప్రచురితమయ్యే పత్రికల గొడవపడలేక ప్రభుత్వం చివరికి 1921లో ఒక కమిషన్‌ను తేయాకుతోటల కూలీల పరిస్థితులను విచారించడానికి నియమించింది. అయితే ఆ కమిషన్‌లోని 8 మంది సభ్యులలో ఇద్దరు ప్రభుత్వాధికారులు, 5 గురు తేయాకు తోటల యజమాన్లు! ఆ కమిషన్ ఒక్క కూలీతో గూడ మాట్లాడకుండ తన పని ముగించిందంటే ఆశ్చర్యపడనక్కరలేదు.

చివరికి జంతువుల కంటే హీనమయిన ఈ జీవితాన్ని భరించలేక 1921లో 8 వేల మంది తేయాకు తోటల కూలీలు అస్సాం వదిలిపెట్టి ఉత్తర ప్రదేశ్ నుండి మదరాస్ వరకు సుదూర ప్రాంతాలలో వున్న తమ ఇళ్ళకు బయలుదేరారు. అయితే, దోచుకోవడానికి శ్రామికులు లేకపోతే దోపిడీ జరగదని, పెట్టుబడి బలవదని, గుర్తించిన ప్రభుత్వం వాళ్ళను పోనీయదల్చుకోలేదు. దగ్గరిలోని కరీంగంజ్ రైల్వేస్టేషన్ అధికార్లకు ఆ కూలీలకు టికెట్లు అమ్మకూడదని ఆదేశం ఇచ్చింది. కలకత్తా నగరం మేయర్ కల్పించుకుని వాళ్ళకు టిక్కెట్లు ఇప్పించగా, తరువాత స్టేషన్ దగ్గర అక్రమంగా వాళ్ళను నిర్బంధించారు. స్టేషన్ ప్లాట్‌ఫారం మీద నిద్రపోతున్న మూడువేల మందిని గూర్ఖా సైనికులు తుపాకులతో పొడిచి, కొందరినయితే చంపి నదిలోకి గూడ పారేసారు.

ఇది 1921 నాటి సంగతి. అంతకు చాలా కాలం ముందే, 19వ శతాబ్దపు రెండవ భాగంలోనే, అక్కడక్కడా చిల్లర సమ్మెలు చేయడం మొదలు పెట్టారు కార్మికులు. వాళ్ళకు యూనియన్లు లేవుగాని, పైన చెప్పిన సహృదయుల వంటి వాళ్ళు నెలకొల్పిన కార్మిక సంక్షేమ సంఘాలు వాళ్ళ తరపున వకాల్తా పుచ్చుకుని, ఆ సహృదయుల వర్గ స్వభావానికి అనుగుణంగా, చాలా సవ్రమతతో అర్జీలు పెట్టుకున్నాయి. ఈ రకంగా ఏర్పడ్డ "సంఘాల"లో చెప్పుకోదగ్గవి బ్రహ్మ సమాజం వారు నెలకొల్పిన Working Men's Mission, శశిపాద బెనర్జీ నెలకొల్పిన Baranagar Institute, బొంబాయిలో లోఖండే అధ్యక్షుడిగా స్థాపించిన Bombay Mill—hands Association. వీటిలో ఈ సంస్థకే కొద్దోగొప్పో కార్మిక

సంఘం స్వభావం ఉండేది. మిగిలినవి కేవలం కార్మికులకు విద్య నేర్పడం కోసమో, సంఘ సంస్కరణ కార్యక్రమాలు నడపడం కోసమో ఏర్పడ్డాయి.

భారతదేశ కార్మికుల మొట్టమొదటి సమ్మెగా చెప్పదగ్గది 1862 ఏప్రిల్–మే నెలలలో జరిగింది. అప్పుడప్పుడే కొత్తగా ఏర్పడ్డ రైల్వేల కార్మికులు హౌరా స్టేషన్ దగ్గర 8 గంటల పని దినం కోసం సమ్మె చేసారు. ఈ సమ్మెలాగే ఆ తొలి రోజులలో వచ్చిన సమ్మెలన్నీ గూడ వేతనానికి పని కాలానికి సంబంధించినవి. 1880 తరవాత సమ్మెలు వేగం పుంజుకున్నాయి. 1882 నుండి 1890 మధ్య బొంబాయి, మద్రాసులలోని ఫాక్టరీలలో 25 చెప్పుకోదగ్గ సమ్మెలు జరిగాయి. అయితే బొంబాయి కలెక్టరు అన్నట్టు ఈ సమ్మెలేవీ గూడ రెండు మూడు రోజుల కంటే ఎక్కువ కాలం నడవలేదు. అంతే కాకుండా ఇవి సంఘటిత పోరాటాలు కావు. కేవలం ఒక్క మిల్లుకో లేక ఒక్క మిల్లులోని ఒక డిపార్టుమెంటుకో పరిమితమయినవి. అంటే, సమస్య ఎవరిదో వారు మాత్రమే సమ్మె చేసారు తప్ప కార్మిక చైతన్యంతో అందరూ కలిసి పోరాటం చేయలేదు. వీటన్నింటిలోకీ చెప్పుకోదగ్గ సమ్మె బడ్జి బడ్జిలోని జనపనార మిల్లులో జరిగింది. ఆరు వారాల పాటు సాగిన ఈ సమ్మె వల్ల కంపెనీకి 80,000 రూపాయలు నష్టం వచ్చిందని కంపెనీ డైరెక్టరు వాపోయాడు. సమ్మెకు కారణం, సూపర్‌వైజర్ల దౌర్జన్యం. ఈ సూపర్‌వైజర్లు ఆధునిక ఫాక్టరీలలోలాగ కేవలం కంపెనీ ఉద్యోగులు మాత్రమే కాక, కూలీలను సేకరించి తెచ్చే కాంట్రాక్టర్లు గూడ కావడం చేత (వీళ్ళను సర్దార్‌లనీ, మిస్త్రీలనీ అంటారు), పని కాలం, వేతనాలతోబాటు, వీళ్ళ పీడన గూడ తొలినాటి సమ్మెలకు, పోరాటాలకు ఒక ముఖ్యమయిన కారణం.

ఈ శతాబ్ది ఆరంభంతో కార్మిక ఉద్యమంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఒకపక్క కార్మికులలో వర్గ చైతన్యం కొంత పెరిగింది. సంఘటితంగా పోరాటాలు నడిపే అలవాటు పెరిగింది; వేరొకపక్క, 1905 నాటి బెంగాల్ విభజన నుండి పుట్టిన స్వదేశీ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మిత వాదుల చేతుల నుండి బాలగంగాధర తిలక్, లాలా లజ్‌పత్‌రాయ్ వంటి (అధికార చరిత్రకారుల దృష్టికి "అతివాదులు" గా కనబడే) నాయకుల చేతులలోనికి నెట్టడం వల్ల, జాతీయ ఉద్యమానికీ కార్మికోద్యమానికీ కొంత సంబంధం ఏర్పడింది. 1905లో కలకత్తాలోని ప్రభుత్వ ముద్రణాలయం కార్మికులు సెలవు రోజులలో పనిచేసి

నందుకుబత్తా ఇవ్వాలని డిమాండుచేసి ఒక నెల రోజులు సమ్మె చేసినప్పుడు, స్థానిక స్వదేశీఉద్యమనాయకులు బాహాటంగా సమర్థించారు.ఈసమ్మెఫలితంగా ఏర్పడ్డది,భారత దేశ కార్మిక సంఘాలలో మొట్టమొదటి వాటిలో ఒకటయిన బెంగాల్ ప్రెస్ వర్కర్స్ యూనియన్. దాదాపుగా అదే సమయంలో ఏర్పడ్డ మరొక యూనియన్, తూర్పు ఇండియా రైల్వే కార్మికుల సంఘం(1906లో). అన్ని నిజమయిన కార్మిక సంఘాల లాగే ఈ సంఘం గూడ పోరాటం నుండే ఏర్పడింది. వేతనం పెంచాలని, పని పరిస్థితులు మెరుగు పరచాలని, తెల్లవాళ్ళు—నల్లవాళ్ళు అనే జాతి విభేదం తొలగించాలని హౌరా, అసన్‌సోల్, బర్ద్వాన్ స్టేషన్ల కార్మికులు చేసిన సమ్మె ఈ సంఘం ఏర్పాటుకు దారి తీసింది. ఆనాటి స్వదేశీ ఉద్యమ నాయకులయిన చిత్తరంజన్ దాస్, బిపన్ చంద్రపాల్ సమ్మెకారుల సభలలో ప్రసంగించారు. ఆతరువాత బట్టలమిల్లులలోను, జనప నార మిల్లులలోను బొగ్గు గనులలోను జరిగిన సమ్మెలను గూడ ఈ జాతీయ నాయకులు బలపరిచారు, కొన్ని సందర్భాలలో క్రియాశీలకంగా వాటికి తోడ్పడ్డారు గూడ.

అయితే ఈ "జాతీయ నాయకులు" వాస్తవానికి అప్పుడప్పుడే బలపడుతున్న భారతీయ పెట్టుబడిదార్ల ప్రతినిధులేనన్న విషయం వాళ్ళ ఆచరణలో బయట పడింది. వాళ్ళు సమ్మెలను బలపరిచింది బ్రిటిష్ యాజమాన్యం గల సంస్థలలో మాత్రమే. భారతీయ బూర్జువా వర్గం యాజమాన్యంలోని సంస్థలలో కార్మికులు సమ్మె చేసినప్పుడు మాత్రంవీళ్ళు సమర్థించడానికిగాని సహకరించడానికి గాని ముందుకు రాలేదు. అంతేకాకుండా ఈబూర్జువా వర్గానికి ఆనాటినుండి ఈనాటి వరకూ భూస్వామ్య వ్యవస్థతో ఉన్నసాంకర్య సంబంధాన్ని నిరూపిస్తూ బాలగంగాధర తిలక్, హిందూమతంలోని కుల వ్యవస్థ వృత్తి విభజన మీద ఆధారపడ్డది కాబట్టి అది కార్మిక సంఘాల ఏర్పాటుకు పనికొస్తుందని అన్నాడు.

బొంబాయిలోను మదరాసులోనుగూడ ఈ కాలంలో చాలా సమ్మెలు జరిగాయి. 1905లో మన దేశానికి కరెంటు రావడంతో, పరిశ్రమల యజమానులు పనికాలం పెంచి చీకటిపడ్డ తరువాత గూడ పని చేయించడం మొదలుపెట్టారు. దీనికి నిరసనగా చాలా సమ్మెలు జరిగాయి.

1908లో తిలక్‌ను 'దేశద్రోహ' నేరానికి విచారించినప్పుడు భారత కార్మిక వర్గపు మొదటి రాజకీయ సమ్మె జరిగింది. ఆ బూటకపువిచారణకు నిరసనగా 20,000 మంది నూలుమిల్లుల కార్మికులు సమ్మెచేసి బొంబాయి నగర పారిశ్రామిక ప్రాంతాలు

తిరిగి ఇతర కార్మికులచేత గూడ సమ్మె చేయించారు. తరువాతిరోజు ఓడ రేవు కార్మికులు, ఇతర చిన్నచిన్న సంస్థల కార్మికులు, వారితో చేరడంతో సమ్మెకారుల సంఖ్య 65,000కు పెరిగింది. జూలై 22న తిలక్‌పైన విచారణ ముగిసి శిక్షవేసారు. 22న బొంబాయి నగర కార్మికులు, చిన్నచిన్న వ్యాపారస్తులు సంపూర్ణంగా సమ్మె నిర్వహించారు. ఆ తరువాతిరోజునుండి పోలీసు లాఠీలను తుపాకీలను ఎదుర్కొని పోరాడారు. మొత్తం బొంబాయి నగర ప్రజానీకంలో, కేవలం పారిశ్రామిక పెట్టుబడి దార్లు మాత్రమే ఈ మహత్తరమయిన సమ్మెతో సహకరించలేదు. తిలక్‌పై విధించిన ఆరు సంవత్సరాల శిక్షను నిరసిస్తూ ఆరురోజులపాటు సార్వత్రిక సమ్మె జరపాలని నిర్ణయించుకున్న బొంబాయి నగర కార్మికులు తమ నిర్ణయాన్ని నిలబెట్టుకున్నారు గాని ఆ క్రమంలో 200 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ మహత్తరమయిన సామ్రాజ్యవాద వ్యతిరేకచర్యను బూర్జువా చరిత్రకారులు గుర్తించదల్చుకోలేదు గాని, లెనిన్ ఆనాడే గుర్తించి "ఇక బ్రిటిష్ రాజ్యానికి పతనం తప్పదు" అన్నారు.

III

సంఘటిత పోరాటాలు

1914 నాటికి భారత కార్మికవర్గం తన బాల్యాన్ని విడిచిపెట్టిందని చెప్పవచ్చు. ఆనాటికి దేశంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థగూడ బలపడింది. 1900 నాటికి ఉన్నవి 1360 కంపెనీలు, ఆ కంపెనీల పెట్టుబడి 36 కోట్లు కాగా, 1914 నాటికి కంపెనీల సంఖ్య 2553కు, వాటి పెట్టుబడి 72కోట్లకు పెరిగింది. 1914లో ప్రారంభ మయిన మొదటి ప్రపంచయుద్ధం ఈ పరిణామాన్ని మరింత త్వరిత పరిచింది. యుద్ధ కాలంలో సహజంగా పెరిగే డిమాండును ఆధారం చేసుకుని, యుద్ధం చివరికి అంటే 1919 నాటికి దేశంలోని కంపెనీల సంఖ్య 2789కి, వాటి పెట్టుబడి 106 కోట్లకు, పెరిగాయి. దీనితోబాటు పారిశ్రామిక కార్మికుల సంఖ్యగూడ పెరిగింది. 1919నాటికి ఈ సంఖ్య 13.6 లక్షలు. అందులో 66 శాతం రైల్వేలలోను, వస్త్ర పరిశ్రమలోను జనపనార పరిశ్రమలలోను ఉన్నారు. వీళ్ళు కాకుండా బొగ్గుగనులలో మరొక 2లక్షల మంది ఉన్నారంటే, మొదటి ప్రపంచయుద్ధం చివరకు గూడ 1850లలో ఏ పరిశ్రమ లయితే ముఖ్యంగా ఉండేవో అవే ముఖ్యంగా ఉంటూ వచ్చాయని తెలుస్తుంది. వలస పాలనలో సహజంగా జరిగే ఆర్థిక వక్రీకరణకిది ఒక సంకేతం.

ఒకపక్క కార్మికుల సంఖ్య పెరుగుతూండగా వేరొకపక్క బ్రిటిష్‌ప్రభుత్వం

యుద్ధ ప్రయోజనాల దృష్ట్యా పెట్టుబడిదార్లమీద ఏ నిర్బంధాలూ పెట్టకుండ అపరిమితంగా దోపిడీ చేసుకోనివ్వడంవల్ల, యుద్ధకాలపు ధరల పెరుగుదలవల్ల, కార్మిక ఉద్యమం ఒక కొత్తమలుపు తిరిగి ముందెన్నడూ లేనంత సంఘటిత రూపాన్ని తీసుకుంది. పెట్టుబడిదార్ల లాభాలు విపరీతంగా పెరిగాయి. వస్త్ర పరిశ్రమలో 260 శాతం వరకు, జనపనార మిల్లులలో 200 శాతం లాభాలు చేసుకున్నారు. కార్మికుల వేతనాలను మాత్రం ధరల పెరుగుదల తినేస్తోందని బ్రిటిష్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ సహితం ఒప్పుకోక తప్పలేదు. ఉదాహరణకు మదరాస్‌లో ధరలు 1914 నుండి 1919కి 75 శాతం పెరగగా, వస్త్ర పరిశ్రమ కార్మికుల వేతనాలు 42 శాతం మాత్రం పెరిగాయి. కలకత్తాలో 1914నుండి 1920కి ధరల పెరుగుదల 100 శాతమయితే జనపనార కార్మికుల వేతనాలు పెరిగింది 40 శాతం మాత్రమే.

ఈ పరిస్థితులు అపూర్వమయిన సంఘటిత పోరాటాలకు దారితీసాయి. మదరాస్‌లో ఒక్క 1920లోనే 62 సమ్మెలు జరిగాయి. బెంగాల్‌లోనయితే ఆ సంవత్సరం చివరి ఆరునెలలలోనే 110 సమ్మెలు జరిగాయి. ఎప్పటిలాగే రైల్వేకార్మికులు వస్త్ర పరిశ్రమ కార్మికులతోను, జనపనార మిల్లుల కార్మికులతోను సమంగా పోరాటాలు చేసారు. రచయిత మాటలలో "సమ్మె పారిశ్రామిక జీవితంలో భాగమయిపోయింది." అన్నిటికంటె చెప్పుకోదగ్గ సమ్మె, బొంబాయిలో 2 లక్షల కార్మికులు 1929 జనవరి 2నుండి ఫిబ్రవరి 3 వరకు నెలరోజులపాటు నడిపిన సమ్మె.

ఈ పోరాటాలనుండి కార్మిక సంఘాలు పుట్టాయి. మదరాస్‌లో బి.పి.వాడియా నాయకత్వాన మదరాస్ కార్మిక సంఘం (Madras Labour Union) నెలకొల్పబడింది. గతంలో కార్మికుల పక్షం వహించిన ఉదార హృదయుల్లాగే వాడియాగూడ సంస్కరణవాది, పోరాటాలకంటే నివేదికలమీద ఎక్కువ నమ్మకం గలవాడు, యుద్ధకాలంలో సమ్మెలు చేయగూడదని, అది 'మన' సైనికులకు ఇబ్బంది కలిగిస్తుందని, 'మన' రాజుకు ద్రోహమని నమ్మిన సామ్రాజ్యవాదపు నమ్మినబంటు.

అయితే ప్రభావరీత్యా వాడియాకంటే ముఖ్యమయిన వ్యక్తి గాంధీ. ఈయన 1918లో అహమ్మదాబాద్‌లో అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం(Ahmedabad Textile Labour Association) అనే సంస్థను స్థాపించాడు. గాంధీ దృక్పథంలో, పెట్టుబడిదారు, కార్మికుడు తల్లీ బిడ్డలవంటివారు. వాళ్ళమధ్య ఏ తేడాలువచ్చినా సంప్రదింపులను ఆశ్రయించాలేగాని సమ్మెలను కాదు. చివరికి ఈ తల్లీ-బిడ్డల' సంబంధం

ఎంతవరకు పోయిందంటే అహమ్మదాబాద్ వస్త్ర కార్మికసంఘం కార్యనిర్వాహక పదవులకు పోటీచేసే హక్కు కంపెనీ యజమాన్లకు ఇవ్వడమే కాకుండ, మునిసిపల్ ఎన్నికలలో ఒక కంపెనీ యజమానిని కార్మికుల అభ్యర్థిగా ఎన్నుకున్నారు గూడ! రచయిత మాటల్లో, "ఈ ప్రశస్తమయిన నమూనాను దేశవ్యాప్తంగా నెలకొల్పాలని గాంధీ ఆశించాడు!" అహమ్మదాబాద్ కార్మికులు చాలాకాలంపాటు ఈ తిరోగామి దృక్పథం ప్రభావంనుండి కోలుకోలేదు.

అయితే గాంధీకి ఇష్టమున్నా లేకపోయినా, కార్మికసంఘాలు దేశ వ్యాప్తంగా ఏర్పడి పోరాటాలు సాగించాయి.1920 నాటికి దేశంలో 120 యూనియన్‌లున్నాయని, వాటి సభ్యత్వ సంఖ్య 2.5 లక్షలనీ అంచనా. అదే సంవత్సరంలో అఖిల భారత కార్మిక సంఘాలసభ(ఎ.ఐ.టి.యు.సి.) ఏర్పడింది. దీని నాయకత్వం కేవలం బూర్జువా జాతీయ నాయకుల చేతిలోనేకాదు, సాక్షాత్తు పెట్టుబడిదార్ల చేతిలో ఉందనే చెప్ప వచ్చు. ప్రారంభ సమావేశంలో వేదికను నిజంగానే అలంకరించిన వారు రచయిత మాటలలో, "కొందరు కోటీశ్వరులు, కొందరు కాంగ్రెస్ నాయకులు, మరికొందరు కార్మిక ఉద్యమంతో ఏ సంబంధం లేనివారు", లాల్‌జీ నారాయణ్‌జీ, లల్లూభాయి సమాల్‌దాస్, లల్లూభాయి జవేరీ మొదలయిన ఫక్తు గుజరాతీసేఠ్ నామధేయాలుగల వాళ్ళంతా సమావేశానికి పెద్దలుగా హాజరయ్యారు. మియా మహమ్మద్ హాజీ జాన్ మహమ్మద్ ఛోటానీ అనే ఒక సింధీ బడా కలప వ్యాపారి ఎ.ఐ.టి.యు.సి. కి 500 రూపాయలు విరాళం ఇచ్చాడట గూడ.

ఇంతయినా గాంధీ మాత్రం హాజరు కావడానికి గాని, తన చేతిలో వున్న అహమ్మదాబాద్ వస్త్ర కార్మికుల సంఘాన్ని ఎ.ఐ.టియు.సి.లో విలీనం చేయడానికి గాని, సమ్మతించలేదు. చాలా ముందుచూపుగల గాంధీకి, కార్మికులు బూర్జువా నాయకత్వంలో సహితం సంఘటితం కావడం ఇష్టం లేదు. పైగా బూర్జువా ప్రభావం, సంస్కరణవాదం, ఎంతబలంగా వున్నా, సంస్థ నాయకులయిన లాజ్‌పతిరాయ్, బాప్టిస్టా చమన్‌లాల్‌లు ఎంత అస్పష్టంగా నయినా సరే కార్మికవర్గ దృక్పథాన్ని, పెట్టుబడిదారీ వ్యతిరేకతను, పోరాట పక్షపాతాన్ని, వెలిబుచ్చకపోలేదు. అది గాంధీ 'తల్లీ-బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకం కావడంతో అటువంటి సంస్థతో సంపర్కం పెట్టుకోవడం ఆ 'మహాత్ముడికి' ఇష్టం లేకపోయింది.

1921లో జరిగిన రెండవ ఎ.ఐ.టి.యు.సి. సమావేశంనాటికి సేఠ్‌జీల ప్రభా

వం కొంత తగ్గి గాంధీవాదుల ప్రాపకం సంస్థమీద పెరిగింది. ఆహ్వాన కమిటీకి ఒక బొగ్గుగని యజమాని అధ్యక్షత వహించిన మాట వాస్తవమేగాని, సభలో ఎక్కువగా కనపడ్డవి గాంధీ టోపీలు, ఖద్దరు లాల్చీలు. అప్పటికి కాంగ్రెస్ పార్టీ 'స్వరాజ్యం' తన ఆశయంగా ప్రకటించుకున్నది కాబట్టి, ఎ.ఐ.టి.యు.సి గూడ ఆ ఆశయాన్ని అంగీకరించింది. దాన్ని వివరిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన చమన్‌లాల్, "స్వరాజ్యం కార్లలో తిరిగేవాళ్ళకు, గవర్నర్ బంగళాల్లో విందులకు హాజరయ్యేవాళ్ళకు కాదు, తమ శ్రమతో ధనికుల సంపదను సృష్టించే లక్షలాది మనుష్యులకు" అన్నాడు. అయినా గాంధీ మాత్రం హాజరూ కాలేదు, సందేశమూ పంపలేదు.

1930 లలో పెట్టుబడిదారీ దేశాలలో సంభవించిన ఆర్థిక మాంద్యపు ఛాయలు వలసదేశాలమీద అంతకు ముందేపడ్డాయి. భారతదేశంలో ఆర్థికమాంద్యం 1922లోనే మొదలయింది. ఆ సంవత్సరం నుండి పారిశ్రామిక కార్మికులసంఖ్య చాలా నెమ్మదిగా పెరగడం గాని, లేదా క్షీణించడం గాని జరిగింది. 1922 నుండి 1927 వరకు దేశ జనాభాలో పెరుగుదల 2 కోట్లు కాగా, అతి ముఖ్య పారిశ్రామిక రంగాలయిన వస్త్ర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, బొగ్గుగనులలో మొత్తం కార్మికుల సంఖ్యలో పెరుగుదల 7 వేలు మాత్రమే. దీనివల్ల అధికమయిన నిరుద్యోగం ఒక పక్కనుండగా, సంక్షోభకాలంలో మార్కెట్‌కోసం బ్రిటిష్ పెట్టుబడిదార్లు, భారతీయ పెట్టుబడిదార్లు, అప్పుడప్పుడే ఎదుగుతున్న జపానీ పెట్టుబడిదార్లు, పరస్పరం ఓడించుకోలేక కార్మికుల మీద పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్దతుగల బ్రిటిష్ పెట్టుబడిదార్లతో పోటీపడలేని భారతీయులు కార్మికులపై దోపిడీని అత్యంతంగా పెంచారు.

ఇవన్నీ కలిసి మళ్ళీ తీవ్రమయిన పోరాటానికి దారి తీసాయి. 1921-30ల మధ్యకాలంలో సంవత్సరానికి సగటున 185 సమ్మెలు జరిగాయి. సంవత్సరానికి సగటున 3,4 లక్షలమంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. జంషెడ్‌పూర్ కార్మికులు కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా సమ్మెచేస్తే, సూరత్ కార్మికులు బోనస్ కోసం సమ్మెచేసారు. చివరికి అహమ్మదాబాద్ కార్మికులు గూడ గాంధీ సిద్ధాంతాలను పక్కకు పెట్టి 53మిల్లులకు చెందిన 43,000మంది రెండునెలలపాటు సమ్మె చేసారు. కారణం : వాళ్ళ జీతాలలో 20 శాతం కోతపెట్టాలనే యజమానుల నిర్ణయం. బొంబాయిలో యజమానులు బోనస్ నిలిపివేయగా, 1.6 లక్షలమంది రెండు నెలలపాటు సమ్మెచేసారు. ఈ సమ్మెలకు విదేశాల కార్మికసంఘాలనుండి, ముఖ్యంగా రష్యానుండి, ఆర్థిక సహాయం లభించింది. అన్ని సమ్మెలలోను, కార్మికులు తమ

యూనియన్లద్వారా సమ్మె నడపడం, కాంగ్రెస్ నాయకులు, ఎ.ఐ.టి.యు.సి. నాయకులు, మొదటినుండి సంప్రదింపులకోసం ప్రయత్నించడం కనబడుతుంది.

1926-29 కాలంలో సమ్మెలు, పోరాటాలు, మరీ తీవ్రరూపం దాల్చాయి. సామ్రాజ్యవాదం తన దేశంలోని కార్మికులపట్ల మర్యాదగానే వుంటూ వలసలలోని కార్మికులను మాత్రం విపరీతంగా దోచుకుంటుందనడానికి నిదర్శనంగా ప్రభుత్వం భారత కార్మికసంఘాలచట్టం, 1926ను ప్రవేశపెట్టింది. బ్రిటన్‌లో కార్మికులమీదలేని ఎన్నో అంశాలు ఈ చట్టం ద్వారా భారతదేశ కార్మికులమీద పెట్టబడ్డాయి. కార్మిక సంఘాల చర్యలపై రకరకాల నిబంధనలు, అవి తమ నిధులను రాజకీయ ప్రయోజనాలకు వాడకూడదనే అంశ., విధించబడ్డాయి. దీని ఉద్దేశ్యం, కార్మికులను జాతీయోద్యమం నుండి దూరంగా ఉంచడమే. ఈ చట్టంతోబాటు, ఒక రైల్వేకమిటీ, 75000 మంది కార్మికులను పనినుండి తొలగించమని సలహా ఈయడంతో దేశవ్యాప్తంగా అన్ని పరిశ్రమలలోను పోరాటాలు కట్టలు తెంచుకుని వచ్చాయి. ఒక్క 1928 సంవత్సరంలోనే, 35 లక్షల పనిదినాలు నష్టమయ్యాయని అంచనా. ఈ సమ్మెలలో చెప్పుకోదగ్గవి ఖరగ్‌పూర్‌లో రైల్వే కార్మికుల సమ్మె, దాని ననుసరించి దేశవ్యాప్తంగా రైల్వేలలో వచ్చిన సమ్మెలు. ఎప్పటిలాగే ఖరగ్‌పూర్ సమ్మెగూడ నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగానే సాగింది. కార్మికుల తెగింపును సహించలేని ఖరగ్‌పూర్ కార్మికసంఘం అధ్యక్షుడు వి. వి. గిరి బహిరంగసభలోనే వాళ్ళ పోరాట పద్ధతులను ఎదిరించాడు. అయినా కార్మికులు పోరాటం ఆపకపోయేసరికి తన నాయకత్వాన్ని సంరక్షించుకోవడం కోసం దిగిరాక తప్పలేదు.

ఈ కాలంలోనే 1928లోను, 1929లోను బొంబాయిలోని వస్త్రపరిశ్రమ కార్మికులు రెండుసార్లు సార్వత్రిక సమ్మెలు నిర్వహించారు. కార్మికుల తొలగింపుకు (retrenchment) వ్యతిరేకంగా జరిగిన మొదటి సమ్మె ఫలితంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో గిర్నీకాంగార్ యూనియన్ అనే పోరాటశీలంగల వస్త్రపరిశ్రమ కార్మికుల సంఘం పుట్టింది. ఆరునెలలపాటు నడిచిన ఈ సమ్మెలో కార్మికులు 250 లక్షల రూపాయల వేతనాన్ని కోల్పోయారు. 1929లో జరిగిన రెండవ సార్వత్రిక సమ్మె, యజమానుల కక్ష సాధింపుచర్యలకు వ్యతిరేకంగా జరిగింది. 32 మిల్లులకు చెందిన లక్షమంది కార్మికులు నెలరోజులపాటు నడిపిన ఈ సమ్మెలో 80 లక్షల పని దినాల నష్టం జరిగింది. సమ్మె నాయకులు రణదివె, దేశ్పాండెలను అరెస్టు చేసినప్పుడు

కార్మికులు నిరసన ప్రదర్శన జరపగా వాళ్ళమీద కాల్పులు గూడ జరిగాయి. బెంగాలులో జనపనార కార్మికులుగూడ పనికాలం పొడిగింపుకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె నిర్వహించారు.

IV

చీలికలు, పునస్సంఘటన

గాంధీకి మొదటినుండి గూడా ఎ.ఐ.టి.యు.సి వంటి కేంద్రకార్మిక సంస్థలంటే ఇష్టంలేదు. అయినా తాను అన్ని విషయాలలోను అవలంబించిన ఎత్తుగడే ఈ విషయంలోను అవలంబించాడు. తాను ఎ.ఐ.టి.యు.సి నుండి దూరంగావుంటూ తన అనుచరులను మాత్రం సంస్థలో పాల్గొననిచ్చాడు, నాయకత్వం గూడా నిర్వహించనిచ్చాడు. ఆనాటి బూర్జువా రాజకీయనాయకులు 'సోషలిస్టు' ముసుగు తగిలించుకోవడం ఇంకా అలవర్చుకోలేదు. కాబట్టి, దీని ఫలితంగా సంస్థకు కేవలం బూర్జువా దృక్పథమే కాదు, ఫక్తు బూర్జువా మార్గదర్శకత్వం కూడ లభించింది. ఉదాహరణకు, ఢిల్లీలో 1927 లో జరిగిన ఏడవ ఎ.ఐ.టి.యు.సి సభకు హాజరయిన పెద్దలలో సాక్షాత్తు జి.డి. బిర్లా ఒకడు.

అయితే ఎ.ఐ.టి.యు.సి.లో కమ్యూనిస్టులు,సోషలిస్టులు,చాలామంది ఉండబట్టి ఈ పరిస్థితి సంక్షోభానికి దారి తీసింది. సంస్థకు వర్గపోరాట దృక్పథముండాలా సంస్కరణవాద దృక్పథముండాలా అన్నది అసలు వివాదమయితే, చీలికకు దారితీసిన సమీప వివాదం అంతర్జాతీయ విలీనానికి (affliation) సంబంధించింది. కాంగ్రెస్ లోని బూర్జువా నాయకులు సంస్థను ప్రపంచ సంస్కరణవాద కార్మిక సంఘాల కేంద్రమయిన అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (International Federation of Trade Unions) తో సంబంధాలు పెట్టుకోవాలనిచూస్తే, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోని సోషలిస్టు భావాలు గలవాళ్ళు, మాస్కోకు చెందిన Red International Labour Union (లేక Protintern) తో విలీనం కావాలని కోరారు. దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిగూడ, బూర్జువా నాయకులు 1929దాకా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తమ లక్ష్యంగా ప్రకటించకపోగా, వామపక్షశక్తులు మాత్రం స్పష్టమయిన సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథాన్ని ప్రదర్శించాయి. వీళ్ల ప్రభావం కార్మికులమీద, ఎ.ఐ.టి.యు.సి లో పెరిగిపోతుండటం చూసి శివరావు వంటి సంస్కరణవాద కార్మిక నాయకులు "సమ్మె మంత్రం పఠించే వ్యక్తులను సంస్థనుండి ఏరేయాల్సిన అవసరముంద"ని బాహాటంగా అన్నాడు. బ్రిటిష్ పాలకులు గూడా భయపడి సమ్మెను

దాదాపుగా చట్ట విరుద్ధం చేసి, వివాద పరిష్కారానికి నిర్బంధ చర్చలను ప్రవేశపెట్టి, రాజకీయ లక్ష్యాలతోగాని, కార్మిక ప్రయోజనాలకోసం గాని సార్వత్రిక సమ్మెలు చేయడాన్ని నిషేధించే Trade Disputes Act, 1928ని ప్రవేశ పెట్టారు. అక్కడితో ఆగకుండ కొంత మంది ఎ.ఐ.టి.యు.సిలోని కమ్యూనిస్టులను, ఆనాటి వామపక్ష శక్తుల సంఘటన అయిన కార్మిక కర్షక పార్టీ (Workers and Peasants Party) నాయకులను మీరట్ కుట్రకేసులో ఇరికించారు.

ఈ నేపథ్యంలో 1929 లో జరిగిన నాగపూర్ సభలో ఎ.ఐ.టి.యు.సి లోని మొదటి చీలిక జరిగింది. వి. వి. గిరి, శివరావు, ఎన్. ఎం. జోషి, చమన్‌లాల్, మొదలయినవాళ్లు ఎ.ఐ.టి.యు.సినుండి విడిపోయి Indian Trade Union Federation ఏర్పరచారు. తెగేదాక లాగే ధైర్యం వామపక్ష శక్తులకు ఇచ్చింది, బొంబాయి వస్త్రపరిశ్రమ కార్మికుల గిర్నీకాంగార్ యూనియన్. ఈ సంఘం 1928-29 నాటి సమ్మెలవల్ల బలపడి కమ్యూనిస్టులకు బొంబాయి నగర కార్మికులలో చాలా పరపతిని సంపాదించి పెట్టింది.

ఆసక్తికరమైన విషయ మేమంటే ఈ చీలిక సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ వామపక్షంలో ఉండడమేకాక, వి. వి. గిరి వంటి వ్యక్తుల ఆరోపణకు తానే వామపక్షం తరఫున వకాల్తా పుచ్చుకొని సమాధానంగూడా చెప్పాడు. ఆయన మాటల్లో "మేము వర్గపోరాటం నేర్పుతున్నామని, వర్గాలమధ్య అంతరాన్ని పెంచుతున్నామని మాపై ఆరోపణ. కాని అంతరాన్ని సృష్టించింది పెట్టుబడిదారీ విధానం, మేముకాదు. మామీద ఆరోపణలు వేయడం గుడ్డితనం, మూర్ఖత్వం. వర్గ విభేదాలను, అసంతృప్తిని సృష్టించేది కమ్యూనిస్టులా లేక తమ పద్ధతులద్వారా అత్యధిక భాగం మానవాళిని వేతన బానిసలుగా మార్చుకున్న పెట్టుబడి దారులు, సామ్రాజ్యవాదులూనా? వర్గ పోరాటాన్ని సృష్టించింది మేముకాదు, పెట్టుబడిదారీ విధానం. పెట్టుబడిదారీ విధానం ఉన్నంతకాలం అది ఉంటుంది. సుఖంగా ఉన్న వాళ్ళకు శాంతి వాక్యాలు పలకడం సులభమే గాని అటువంటి సదాశయాలు మామీదున్న పీడనను తొలగించవు. మమ్మల్ని దోచుకుని పైకి ఎగబాకి ఇప్పుడు అక్కడి నుండి మీరు ఉపన్యాసాలు దంచుతున్నారు. వర్గ పోరాటం గతంలో ఉంది. ఇవ్వాళా ఉంది. మూలకారణాల్ని తొలగిస్తేనే శాంతి లభిస్తుంది." (స్వేచ్ఛానువాదం) ఈ మాటలలో చాలా గందరగోళం ఉంది గాని వాటిలోని వేడి మాత్రం గమనార్హం. తర్వాతి కాలంలో నెహ్రూ ఎంత చల్లబడ్డాడో

ఆలోచిస్తే ఆశ్చర్యం కలగకమానదు తొలినాటి వేడి తెచ్చి పెట్టుకున్నదేమోనన్న అనుమానం రాక మానదు.

ఈచీలిక జరిగింది'ఎ.ఐ.టి.యు.సి పదవ సమావేశంలో. 11వ సమావేశం 1931 లో కలకత్తాలో జరిగింది. అప్పుడు రెండవసారి చీలిక జరిగి నెహ్రూ, సుభాష్, వంటి కాంగ్రెస్ వాదులు వెళ్ళిపోగా, కమ్యూనిస్టులు మాత్రం All India Red Trade Union Congress (AIRTUC)ని ఏర్పరిచారు. దీని నాయకులు ఎస్. వి. దేశ్పాండే, ఎస్. జి. సర్దేశాయి, తదితరులు.

అయితే సరిగ్గా ఇదే సమయంలో, అంటే 1929 తరువాత పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం వచ్చి, కార్మికులను తీవ్రమయిన దోపిడీకి గురిచేసింది. అటువంటి సమయంలో కార్మిక సంఘాలు అనైక్యంగా ఉండడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభంవల్ల భారతదేశంలో ఫ్యాక్టరీల మూసివేత, కార్మికుల తొలగింపు, జీతాలలో కోతలు మొదలయినాయి. సంక్షోభంలో బ్రిటిష్ పాలకులు సహజంగానే తమ బ్రిటిష్ పెట్టుబడిదార్ల అవసరాలను సంరక్షించడం మొదలుపెట్టారు. Imperial Preference పేరిట ఇనుము, ఉక్కు, వస్త్ర పరిశ్రమలలో బ్రిటిష్ పెట్టుబడిదార్లకు పక్షపాతం చూపించడం మొదలుపెట్టారు. దీనితో భారతీయ పెట్టుబడిదార్లు గత్యంతరం లేక కార్మికులపై దోపిడీని, పనినుండి తొలగింపును ఎక్కువచేసారు. 1934 సంవత్సరంలో బొంబాయిలోని బట్టలమిల్లులలో 50 శాతం మూతపడి 61,000 మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. 1921 నుండి మొదలుపెట్టిన వేతనాలకోత ఫలితంగా మరొక 42 మిల్లులలో వేతనాలు 1926 తో పోలిస్తే 1934 లో 20 శాతం తక్కువ ఉన్నాయి. బొంబాయి మిల్లు యజమాన్లను ఆదర్శంగా తీసుకుని అహమ్మదాబాద్‌లో 20 శాతం, షోలాపోర్‌లో 12½ శాతం, మదరాస్‌లో 15 శాతం, నాగపూర్‌లో 20 శాతం, అకోలాలో 25 శాతం తగ్గించారు.

బెంగాలులోని జనపనార మిల్లులలోనూ ఇదే పరిస్థితి. 1929–34 ల మధ్య 83,000 మంది నిరుద్యోగులయ్యారు. ఆ తరువాత రెండు షిఫ్టుల స్థానాన ఒకే షిఫ్టు ప్రవేశపెట్టి మరొక 25 శాతం కార్మికులను పనినుండి తొలగించారు. జీతాలు గూడ కోసారు. స్పిన్నర్‌ల నెలసరివేతనం రు. 7 నుండి 6కు, వీవర్లవేతనం రు. 12 నుండి

9కి పడిపోయాయి. రైల్వేలలోనయితే 1931 నుండి 1932 లోపల (ఒక్క సంవత్సరంలో) 50,000 మందిని పనినుండి తొలగించారు. అలాగే ఇనుము—ఉక్కు కర్మాగారాలలోను, మునిసిపాలిటీలోను, తపాలా శాఖలోను, ఓడ రేవుల లోను, జీతాలు కోత పెట్టడం, పనినుండి తొలగించడం నిత్యకృత్యాలయినాయి.

ఈ పరిస్థితిలో కార్మికులు తమ మనుగడ కోసం పోరాటాలు చేయక తప్ప లేదు. అప్పటికి కేంద్ర కార్మిక సంస్థలు ఒకటి కాక మూడయినప్పటికీ, సమ్మె పోరాటాలు మాత్రం ఉధృతంగా సాగాయి. 1931 నుండి 1936 వరకు సంవత్స రానికి సగటున 150 సమ్మెలు జరిగాయి. 1931, 32, 33 సంవత్సరాలలో 20 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. 1934 లో నయితే 47 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. పరిస్థితి ఎంత తీవ్రమయిందంటే గాంధీకి ప్రీతిపాత్రమయిన అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం గూడ ఆయనగారి 'తల్లీ-బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకంగా 25 శాతం వేతనం తగ్గింపుకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి సిద్ధ పడ్డారు, గాంధీ భయపడి తన మిత్రులయిన గుజరాతీ పెట్టుబడిదార్లను సంరక్షించ డంకోసం చర్చలకు దిగి, 6 శాతం మాత్రం జీతం తగ్గించేటట్టు, కొంతమంది కార్మికులను పనినుండి తొలగించేటట్టు ఒప్పందం చేసుకున్నాడు. అన్యాయమయిన ఈ ఒప్పందాన్ని కార్మికులు సంతోషంగా స్వీకరిస్తారని తన ఆశ అనీ, కార్మికుల అవసరాలు పెట్టుబడిదార్ల అవసరాలు ముడిపడి ఉన్నట్లు వాళ్ళు గుర్తించాలనీ ఉచిత విద్యాబోధన గూడ చేసాడు.

అయితే కార్మిక సంఘాల అనైక్యత కార్మికుల పోరాటాన్ని దెబ్బతీసింది. ఈ విషయం బొంబాయి కార్మికుల సమ్మెలో స్పష్టంగా బయటపడింది. గిర్నీ కాంగార్ యూనియన్ రెండుగా చీలి, ఒక పక్క కమ్యూనిస్టులు సమ్మె కోసం ఏర్పాట్లు, ప్రచారం చేస్తూండగా, వేరొక పక్క సంస్కరణవాద నాయకులు చర్చల తోను సంప్రదింపులతోను పోరాటాన్ని ఆపాలని ప్రయత్నం చేయడంతో కార్మికులు తీవ్రంగా దెబ్బతిన్నారు.

ఈ పరిస్థితిలో కార్మిక నాయకులంతా ఐక్యతకోసం కృషిచేసారు. 1935 నాటికి AIRTUC మళ్ళీ AITUC లో చేరింది. అయితే వి. వి. గిరి, శివరావుల నాయకత్వంలోని ITUF మాత్రం AITUC లో కలవక, రాయిస్టులతోను ఇత రులతోను కలిసి NTUF(Natoinal Trade Union Federation) అనే

మరొక సంస్థ ఏర్పడింది. 1936 లో AITUC, NTUF ల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి ఒక Joint Labour Board ఏర్పడింది. అప్పటికి NTUF తో ఉన్న సంఘాల సంఖ్య 60, సభ్యత్వం 1,47,516. AITUC తో ఉన్నది 71 సంఘాలు, సభ్యత్వం 93,750.

V

అధికార మార్పిడి

1947 లో భారతదేశానికి వచ్చింది అధికార మార్పిడియేననుకుంటే అది 1935 లోనే ప్రారంభమయింది. ఆ నాటికి క్రమంగా తమ చేతుల్లోకి అధికారం రావడం మొదలయిందని గుర్తించిన బూర్జువా వర్గానికి ఇక కార్మికవర్గంతో అవసరం తీరిపోయింది. అవసరం తీరిపోవడమేకాదు, అంతవరకు అధికారం చేజిక్కడానికి ఒక సాధనంగా వున్న కార్మిక వర్గం ఇప్పుడు ప్రధానశత్రువయింది. అందుకే NTUFలోని 'కార్మిక నాయకులు' గాని, పునస్సంఘటితమయిన AITUC లోని నెహ్రూవంటి నాయకులు గాని కార్మికోద్యమ ఐక్యతపట్ల అంత ఆసక్తిచూపలేదు. కార్మిక ఉద్యమాలపట్ల నయితే ఏమాత్రం చూపలేదు.

1935 నాటి భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఆచట్టాన్ని ఫైజ్‌పూర్ సమావేశం (1936) లో 'నిర్ద్వంద్వం' గా నిరాకరించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో మాత్రం పాల్గొంది. ఫైజ్‌పూర్ సమావేశానికి అధ్యక్షత వహించిన నెహ్రూ, ఎన్నికలలో పాల్గొనడం సామ్రాజ్యవాదంతో సహకరించడానికి కాదు, ఆ 1935 చట్టాన్ని వ్యతిరేకించడానికేనన్నాడు. కాబట్టి గెలిచినా గూడా మంత్రి వర్గాలు ఏర్పరచడం, పరిపాలన కొనసాగించడం కూడ దన్నాడు. అయితే ఎన్నికలలో గెలిచిన తరువాత మాత్రం కాంగ్రెస్ పార్టీ నెహ్రూ అభీష్టానికి వ్యతిరేకంగా పరిపాలనకు ఒడిగట్టింది. అదేసమయంలో, రాబోయేరెండవ ప్రపంచ యుద్ధానికి సన్నద్ధమయ్యే క్రమంలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మళ్ళీ బలం పుంజుకుంది. దానితో కార్మికులు గూడా, 1930 ల మొదటి భాగంలో కోల్పోయిన దానిని తిరిగి పొందటానికి ప్రపంచవ్యాప్తంగా సమ్మెలు ప్రారంభించారు. అందులో భాగంగా భారత కార్మిక వర్గం గూడ పోరాటాలు చేపట్టింది. 1937 లో 379 సమ్మెలు జరిగాయి, 89 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1938 లో 399

సమ్మెలు జరిగాయి, 90 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1939 లో 406 సమ్మెలు జరిగాయి, 50 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. వాటన్నింటిలోకి చెప్పుకోదగ్గది బెంగాల్ జనపనార మిల్లు కార్మికుల సార్వత్రిక సమ్మె. 1937 ఫిబ్రవరి నుండి మే వరకు జరిగిన ఈ 74 రోజుల సమ్మెలో 2.25 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. అయితే ఎప్పటిలాగ వస్త్రపరిశ్రమకు, జనపనార పరిశ్రమకు, రైల్వేలకు పరిమితమై పోకుండా ఈ సారి సమ్మెలు అగ్గిపెట్టెలు, బీడీలు,తదితర చిన్న పరిశ్రమలకు, రిక్షా జట్కా కార్మికులకుగూడ వ్యాపించాయి.

అప్పుడప్పుడే కొన్ని రాష్ట్రాలలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ముస్లింలీగ్ పార్టీలు, తమకు ఇక కార్మికులతో అవసరం లేదని చూపిస్తూ ఈ సమ్మెలను,పోరాటాలను బ్రిటిష్ వాళ్ళతో సమంగా అణచి వేశాయి. కాన్‌పూర్‌లో 46,000 మంది కార్మికులు సమ్మెకు ఉద్యుక్తంకాగా, ఒక కాంగ్రెస్ కార్మిక నాయకుడు హరిహరనాథశాస్త్రి వాళ్లకు సమ్మె చేయవద్దని సలహా ఇస్తే, వేరొక పక్క ముఖ్యమంత్రి గోవింద వల్లభ పంత్ సెక్షన్ 144 ప్రకటించి మీటింగులను సమ్మెలను నిషేధించాడు.

అంతే కాదు. బ్రిటిష్ వారి అడుగుజాడల్లో నడుస్తూ బొంబాయి రాష్ట్రపు కాంగ్రెస్ ప్రభుత్వం 1939లో ఒక పారిశ్రామిక తగాదాల చట్టాన్ని (Bombay Industrial Disputes Act, 1939) రూపొందించింది. ఈ చట్టం దాదాపుగా సమ్మెలను అసాధ్యంచేసి చర్చలనే ఏకైక చట్టబద్ధమయిన పరిష్కార మార్గం చేసింది. అహమ్మదాబాద్‌లో గాంధీ ఏ పద్ధతులనైతే 1919లో ప్రవేశ పెట్టాడో ఆ తిరోగామి పద్ధతులను ఈ బిల్లు చట్టబద్ధం చేసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపినపుడు పోలీసు కాల్పులలో ఇద్దరు చని పోయారు.

ఒక పక్క ఇదిజరుగుతుండగా వేరొకపక్క 1940లో ఎన్. టి. యు. ఎఫ్ మళ్లీ ఎ.ఐ.టి.యు.సి. లో కలిసి కార్మికసంఘాల ఐక్యత పునరుద్ధరించబడింది. ఈ ఐక్యత తాత్కాలికమే అయినా, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సమ్మెలనిషేధం వల్లా, 'అత్యవసర' రంగాలలో పని గంటల పొడిగింపు వల్లా, ధరల పెరుగుదలవల్లా, కార్మికులకు కలిగిన కష్టాలకు వ్యతిరేకంగా పోరాడటానికి పనికి వచ్చింది. ఈ క్రమంలో ఎ.ఐ.టి.యు.సి ఒక సంస్థగా గూడా పెరిగి యుద్ధం చివరికి సభ్యత్వసంఖ్య 7లక్షలకు చేరుకుంది.

అయితే 1947 దగ్గర పడేకొద్దీ కాంగ్రెస్ పార్టీకి కార్మికుల పట్ల అసహనం

పెరిగింది. 1946 లో బొంబాయినగరంలోని నౌకా సిబ్బంది తమకు చాలాకాలంగా వున్న కోర్కెల పరిష్కారం కోసం ఉద్యమించినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రమయిన చర్యలు తీసుకుంటానని బెదిరిస్తే, నౌకా సిబ్బంది నగరప్రజానీకానికి తమతో సహకరించి బంద్ నిర్వహించమని పిలుపిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున వల్లభభాయి పటేల్ సహకరించలేదు. పార్టీ అధ్యక్షుడు అజాద్ "ఇది సమ్మెలకు బంద్‌లకు సమయంకాదు" అన్నాడు. అంటే అర్థం, బూర్జువావర్గం అధికారంలోకి రాబోతున్న తరుణంలో కార్మికులు సమ్మెలుచేస్తే సహించమని. అయినా నగర ప్రజలు, ముఖ్యంగా శ్రామిక జనం, బంద్ నిర్వహించి, పోలీసుల కాల్పుల నెదుర్కొని 250 మంది ప్రాణాలర్పించారు.

ఈ విద్రోహానికి పరాకాష్టగా, 1947 మే నెలలో కాంగ్రెస్ పార్టీ పెద్దలంతా కలిసి ఎ.ఐ.టి.యు.సి నుండి కాంగ్రెస్ వాదులంతా బయటకు వచ్చేయాలని, మరొక సంస్థను ఏర్పరచాలని నిర్ణయించుకున్నారు. ఇట్లా ఏర్పడింది Indian National Trade Union Congress(INTUC). ఈ సారి నెహ్రూ వర్గాలగురించి వర్గ పోరాటపు అనివార్యత గురించి ఉపన్యాసాలు ఇవ్వలేదు. ఐ. ఎన్. టి. యు. సి. ని ఏర్పరచిన సమావేశంలో తాను స్వయంగా పాల్గొన్నాడు. నెహ్రూలాగా అభ్యుదయపు పోజులు కొట్టడం తెలీని ఫక్తు రియాక్షనరీ వల్లభభాయి పటేల్, "ఈ పని ఎన్నడో చేసి ఉండాల్సింది" అన్నాడు. దీనితో భారత బూర్జువా వర్గం తనకు అధికారం చేతికి వచ్చిందని, ఇక కార్మిక వర్గంతో శత్రుత్వమే తప్ప స్వల్పకాలిక మిత్రత్వంగూడా లేదని ప్రపంచానికి చాటి చెప్పింది.

50 పైసలు